క్లుప్తంగా

మైనారిటీ పాఠశాలలో ప్రవేశానికి లక్కీ డ్రా


లక్కీ డ్రా నిర్వహిస్తున్న ఆర్‌ఎల్‌సీ కిరణ్‌గౌడ్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి సోమవారం జిల్లా ఆర్‌ఎల్‌సీ కిరణ్‌గౌడ్ సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. నాణ్యమైన విద్యాబోధనతో పాటు భోజనం అందిస్తున్న మైనారిటీ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని ఆర్‌ఎల్‌సీ కిరణ్‌గౌడ్ కోరారు.

మండల టాపర్‌ను సన్మానించిన షబ్బీర్ అలీ



కామారెడ్డి టౌన్: పదో తరగతి ఫలితాల్లో 565 మార్కులు సాధించి పాల్వంచ మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థి సిద్రా ఫిర్దోస్‌ను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సన్మానించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విద్యార్థినిని అభినందించి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు.అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు.

మాచారెడ్డి మండల టాపర్‌కు సన్మానం



మాచారెడ్డి: పదో తరగతిలో 581 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన సభత బస్సుంను సోమవారం అధికారులు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి దేవేందర్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో గోపి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు వాజ్‌పేయి


మాట్లాడుతున్న లోకా భూపతిరెడ్డి

కామారెడ్డి టౌన్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఆదర్శనీయుడని బీజేపీ రాష్ట్ర నాయకుడు లోకా భూపతిరెడ్డి అన్నారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విరాసత్ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాకిస్తాన్ తో కార్గిల్ యుద్ధం చేసి విజయం సాధించి సరియైన గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎమ్మెల్యే అరుణా తార, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, రంజిత్ మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, రాము, నాయకులు మోటూరి శ్రీకాంత్, సంతోష్ రెడ్డి, వేణు, సురేష్, శ్రీనివాస్, రవీందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో బీడీ కార్మికులు పాల్గొనాలి


ప్రచారం చేస్తున్న చంద్రశేఖర్

కామారెడ్డి టౌన్ : కేంద్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో బీడీ కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయా బీడీ కంపెనీలలో ప్రచారం చేసి కార్మికులతో మాట్లాడారు. బీడీ పరిశ్రమ రక్షణ కోసం వెయ్యి బీడీలకు కూలీ రూ. 750 ఇవ్వాలని, 26 రోజుల పాటు కార్ఖానాలను నడిపించాలని, రాజీనామా చేసిన కార్మికులకు కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నాయకులు అరుణ్, రాజనర్సు, పురుషోత్తం, చక్రపాణి, రాములు, ప్రభు తదితరులున్నారు.

ఎల్‌ఐసీ అధికారులకు వీడ్కోలు

కామారెడ్డి అర్బన్: ఎల్‌ఐసీ కామారెడ్డి శాఖలో పనిచేస్తున్న ముగ్గురు సిబ్బంది వివిధ ప్రాంతాలకు బదిలీ కాగా సోమవారం వీడ్కోలు పలికారు. సిబ్బంది కాసాల అనిల్‌కుమార్, అమర్‌నాథ్, సంపత్‌కుమార్‌లకు బ్రాంచ్ మేనేజర్ ఎస్.కృష్ణమోహన్, బీమా ఏజెంట్ల సమాఖ్య నాయకులు, ఏజెంట్లు శాలువతో సన్మానించారు.లియాఫీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.నారాయణరావు, ప్రదీప్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

- పెద్దకొడప్‌గల్ మండలంలో యథేచ్ఛగా మట్టి దందా
- పక్క మండలాలకు తరలిస్తూ ఆర్జన
- ధ్వంసమవుతున్న రహదారులు
- చెరువుల్లో 10 ఫీట్ల లోతు గోతులు ఏర్పడుతున్న పరిస్థితి
- పట్టించుకోని అధికారులు


వడ్లం గ్రామ పెద్ద చెరువులో మట్టిని తవ్వుతున్న పొక్లెయిన్, పక్కన ట్రాక్టర్లు


ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న నల్లమట్టి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలో అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి దందా కొనసాగిస్తున్నారు. వడ్లం, కాస్లాబాద్ గ్రామాలలోని చెరువుల నుంచి ప్లొకెయిన్ యంత్రాలను ఉపయోగించి మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతూ మట్టిని ట్రాక్టర్లలో పక్కమండలాలకు తరలిస్తున్నారు. పిట్లం మండలంలోని అన్నారంతో పాటు వివిధ మండలాల నుంచి వచ్చిన సుమారు 120 నుంచి 150 ట్రాక్టర్ల సహాయంతో సంగారెడ్డి జిల్లాలోని కంగ్టి మండలానికి మట్టిని తరలిస్తున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో చెరువుల్లో అనేక చోట్ల 10 నుంచి 15 ఫీట్ల లోతు గోతులు ఏర్పడుతున్నాయి. వర్షాకాలంలో ఈ గోతులలో నీరు నిండి ప్రజల పాలిట శాపాలుగా మారనున్నాయి. గతంలో చెరువులో ఏర్పడ్డ గోతులతో ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. విచ్చలవిడిగా ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి...

చెరువులో పూడిక పేరుకపోతే, ఆమేరకు మాత్రమే తవ్వకాలు జరిపి అవసరమైన వారికి ప్రభుత్వం సీనరేజి చార్జీలు కట్టించుకుని మట్టిని సరఫరా చేస్తుంది. ఇలాంటి నిబంధనలు ఏమీ పాటించకుండానే అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడతున్నారు. సీనరేజి చార్జీలలో స్థానిక గ్రామ పంచాయతీలు తమకు రావలసిన వాటా కోల్పోతున్నాయి. ఈవిషయంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఫిర్యాదు చేసినా స్పందన లేదు



నిబంధనలకు విరుద్ధంగా చెరువులో మట్టిని తవ్వుతూ ట్రాక్టర్లలో పక్క మండలాలకు తరలిస్తూ భారీగా ఆర్జిస్తున్నారు. దీంతో చెరువుల్లో భారీ గోతులు ఏర్పడుతున్నాయి. వర్షకాలంలో ఈ గోతులలో నీరు నిండి భవిష్యత్తులో ఇవి ప్రజల పాలిట శాపాలుగా మారనున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోని రైతుల ప్రయోజనాలను కాపాడాలి. – మారుతి, రైతు, వడ్లం గ్రామం

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు

చెరువులో మట్టి తవ్వడానికి ఎలాంటి అనుమలు ఇవ్వలేదు. రైతులు వారి పంట పొలాల్లో వేసుకుంటున్నట్లు తెలిసింది. పెద్ద మొత్తంలో పక్క మండలాలకు మట్టిని తరలిస్తున్నట్లు తెలియదు.అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

–సుకుమార్ రెడ్డి, ఏఈ, ఇరిగేషన్

‘ప్రాణహిత చేవెళ్ల’ ద్వారా గోదావరి జలాలు


భిక్కనూరులో సీఎం, మంత్రి ఉత్తమ్, షబ్బీర్ అలీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

భిక్కనూరు: ప్రాణహిత చేవెళ్ల పథకం ద్వారా మండలానికి గోదావరి జలాలు తీసుకురావడం జరుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి ,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రాణహిత చేవెళ్ల పథకం ద్వారా గోదావరి జలాలు తరలించేందుకు ప్రభుత్వం రూ. 23 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు రాజు, పట్టణ సొసైటీ అధ్యక్షులు భూమయ్య ,మండల కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం అధ్యక్షులు నరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి లింబాద్రి, మండల యువజన విభాగం అధ్యక్షులు వెంకటేష్ నాయకులు మైపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, సిద్ధిరాములు, ఆంజనేయులు, రామచంద్రం, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

రైతుల విశిష్ట సంఖ్య నమోదు


రైతుల విశిష్ట సంఖ్య నమోదు చేస్తున్న అధికారులు

సదాశివ నగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజివాడీ క్లస్టర్‌లో సోమవారం రైతులకు 11 సంఖ్యలతో కూడిన యూనిక్ కోడ్‌ను నమోదు చేసినట్లు మండల వ్యవ సాయ అధికారి ప్రజాపతి తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీ అనే పేరుతో రైతుల వివరాలను నమోదు చేసి వారికి కోడ్ ను ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి రైతుకు ఈ కోడ్ ను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో, రైతులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరాన్ని వినియోగించుకోవాలి


నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతున్న ఎంఈవో చందర్


రామారెడ్డిలో యోగా చేస్తున్న విద్యార్థులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి వేసవికాల శిక్షణా శిబిరాన్ని ఎంఈవో చందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 6–9వతరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇందులో కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్ ,క్రాఫ్స్ అండ్ ఆర్ట్స్ సబ్జెక్టులపై శిక్షణా కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో మండల పీఆర్టీయూ అధ్యక్షులు గునిగెరి హన్మండ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామారెడ్డిలో యోగా సమ్మర్ క్యాంప్

రామారెడ్డి : మండల కేంద్రంలో సోమవారం యోగా సమ్మర్ క్యాంప్‌ను ఎంఈవో ఆనంద్ రావు ప్రారంభించారు. ఇందులో యోగా, ఫుట్‌బాల్ శిక్షణ క్లాసులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనంద్, హెచ్‌ఎం సురేశ్, క్యాంప్ ఆర్పీలు రాజకుమార్, శ్రీనివాస్, సీఆర్పీలు మహమూద్, విద్యార్థులు పాల్గొన్నారు.

హమాలీల కొరత తీర్చాలని వినతి


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఒడ్డేపల్లి గ్రామ కొనుగోలు కేంద్రంలో హమాలీల కొరతను తీర్చాలని కోరుతూ సోమవారం తహసీల్ కార్యాలయంలోని ప్రజావాణిలో సోమవారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కొనుగోలు కేంద్రంలో కుప్పలు, తెప్పలుగా ధాన్యం ఉందని, హమాలీలు కొరత కారణంగా తూకాలు నత్త నడకన సాగుతున్నాయని వారు పేర్కొన్నారు.

రైతు బీమా అందడం లేదు


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీబీపేట: రైతు కుటుంబానికి నెలులు గడుస్తున్నా రైతు బీమా పథకం డబ్బులు అందడంలేదని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. ప్రమాదవశాత్తు మరణించిన రైతు కుటుంబానికి బీఆర్ఎస్ ప్రభుత్వం వారం రోజుల్లోనే రూ. ఐదు లక్షలు చెల్లించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తిని జనార్ధన్, ధర్మగారి రాజా గౌడ్, ఎర్రగుళ్ల బాబు, దాయరి రంజిత్ తదితరులున్నారు.

క్షేత్రస్థాయిలో భూభారతి సర్వే పరిశీలన


సర్వేను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి

లింగంపేట(ఎల్లారెడ్డి): భూభారతి సర్వేలో భాగంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి సోమవారం లింగంపేట మండలం ముంబోజిపేట గ్రామ శివారులో క్షేత్రస్థాయి విచారణ చేశారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో గ్రామస్తులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దాంతో సబ్‌కలెక్టర్ క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ముంబోజిపేట గ్రామంలో సర్వే నంబర్ 151, 302లో అటవీ శాఖ, రెవెన్యూ శాఖల మధ్య గల వివాదాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కార మార్గాలు చూపుతామన్నారు. రైతులు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ భరత్, పంచాయతీ కార్యదర్శి పవన్, అటవీ, రెవిన్యూ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన


పాతరాజంపేటలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ అపర్ణ

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతుల ధాన్యాన్ని, నేలవాలిన పంటలను వ్యవసాయ శాఖ అధికారులు ఏడీఏ అపర్ణ, ఏవో పవన్‌కుమార్, ఏఈవో శ్రీనివాస్‌రెడ్డిలు సోమవారం పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని వ్యవసాయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బక్కన్నగారి రాజు, నరేష్ లక్ష్మణ్, బాస్కర్, రాజయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జంగంపల్లిలో కూలిపోయిన ఇళ్లను పరిశీలించిన ఆర్‌ఐ

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో కూలిపోయిన ఇళ్లను సోమవారం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలయ్య పరిశీలించారు. ఆదివారం గ్రామంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామానికి చెందిన కొలిమి రవి, కొలిమి పోశయ్యలకు చెందిన నివాసపు రేకుల ఇల్లు పాక్షికంగా కూలిపోయింది.ఈ విషయాన్ని బాధితులు రెవెన్యూ అధికారులకు తెలపడంతో వారు పాక్షికంగా కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. సుమారు 30 వేల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలయ్య మాట్లాడుతూ పూర్తి వివరాలను ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందన్నారు. బాధితులకు నష్టపరిహారం వచ్చే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పిడుగు పాటు బాధితులకు పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న అధికారులు

బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్నప్పుడు ఆదివారం పిడుగు పడి అయిదుగురికి గాయాలయ్యాయి. వారు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం వారిని తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్‌లు పరామర్శించారు. బాధితులతో మాట్లాడి త్వరగా కోలుకోవాలని ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు.

బాన్సువాడలో డ్రైయినేజీలు శుభ్రం

సాక్షి ఎఫెక్ట్


బాన్సువాడలో డ్రైయినేజీలను శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

బాన్సువాడ : మున్సిపాలిటీ పరిధిలో 19 వార్డుల్లో సోమవారం డ్రైయినేజీలను మున్సిపల్ అధికారులు కార్మికుల చేత శుభ్రం చేయించారు. ఈ నెల 4న 'బాన్సువాడలో డ్రైయినేజీలు అధ్వానం' శీర్షికన వచ్చిన కథానానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపాలిటీలో డ్రైయినేజీల అధ్వానంపై జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.దీంతో మున్సిపల్ కార్మికులందరిచే అన్ని వార్డుల్లో డ్రైయినేజీల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వస్తువులు, చెత్తాచెదారంను తొలగించారు. మురికినీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు.

అర్హులకు బ్యాంకు రుణాలను అందించాలి



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్

ఎల్లారెడ్డి: అర్హులైన వారికి బ్యాంకు రుణాలను అందించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాలలో గల బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రుణాలను అర్హులైన వారికి అందించాలని, ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. డ్వాక్రా సంఘాలకు రుణాలను అందించి వాటి రికవరి జరిగేలా చూడాలని అన్నారు. రాజీవ్ యువ వికాసానికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిందని, దానికి సంబంధించిన గైడ్‌లైన్స్ రాలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రకాష్, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు మేనేజర్లు పవన్, రవీందర్, మల్లేష్ తదితరులున్నారు.

ఘనంగా ప్రారంభమైన ఎల్లమ్మ ఉత్సవాలు


బంగారు ముక్కెర అందజేస్తున్న రాజనర్సాగౌడ్ దంపతులు

దోమకొండ: మండల కేంద్రంలో రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయ 20వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గణపతిపూజ, పుణ్యవచనం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారి కల్యాణం సందర్భంగా గ్రామానికి చెందిన బొంబొతుల చంద్రకళ రాజనర్సాగౌడ్ దంపతులు బంగారు ముక్కెరను ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తీగల నాగభూషణం గౌడ్, ఉపాధ్యక్షులు నర్సాగౌడ్, కార్యదర్శి రవిగౌడ్, కోశాధికారి యాదగిరి గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు రాజనర్సాగౌడ్, ఉపాధ్యక్షులు కర్రోల్ల శ్యాంసుందర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుక


ఎల్లారెడ్డిలో పూజలందుకున్న బగళాముఖి అమ్మవారు

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలో బగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించినట్లు జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ తెలిపారు. వైశాఖమాసంలోని అష్టమిని పురస్కరించుకుని అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాపర్తి బాలకిషన్, మర్మల్ల వెంకటేశం, సతీష్, రేవంత్, సాయినాథ్, శివరాజు తదితరులున్నారు.

సంక్షిప్తం

డ్రైయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో కాంగ్రెస్ నాయకులు సోమవారం డ్రైయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేయాలని కాంగ్రెస్ నాయకులు కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వినోద్‌గౌడ్, గోపి, గోవింద్, అంజయ్య తదితరులున్నారు.

పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మహ్మద్ రఫత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో 40 సీట్లకు అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. నాన్‌మైనారిటీ విద్యార్థులకు ఈనెల 8న లక్కీడీప్ ద్వారా అడ్మిషన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు.

ధర్నా పోస్టర్ల ఆవిష్కరణ

బిచ్కుంద(జుక్కల్): మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా పోస్టర్లను సోమవారం బిచ్కుందలో మత్స్యకారుల సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈ నెల 15న హైదరాబాద్‌లో ఇందిర పార్కు వద్ద మత్స్యకారుల మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

‘తప్పుడు రికార్డులతో రెండవ సారి భూమి అమ్ముతున్నారు’

కామారెడ్డి అర్బన్: తాము భూమి విక్రయించిన తర్వాత తప్పుడు డాక్యుమెంట్లు తయారు చేసి తమను ఇబ్బందులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ పరిధిలోని లింగాపూర్‌కు చెందిన వైద్య కిషన్‌రావు కలెక్టర్‌తో పాటు ఆర్డీవో, తహసీల్దార్లకు సోమవారం ఫిర్యాదు చేశారు. లింగాపూర్ శివారులోని సర్వేనంబర్ 17/2ఏ, 2బీ, 2సీ, 2డీ, 2ఈ నంబర్లలో 23 ఏళ్ల క్రితం సాదాబైనామాతో ప్లాట్లుగా చేసి తాను తన సోదరులు వెంకటేశ్వరరావు, భాస్కర్‌రావు, రామారావు, శేషారావులు విక్రయించగా ఇప్పుడు ఇతరులతో పాటు తన సోదరుడు శేషారావు అక్రమంగా రికార్డులు సృష్టించి మళ్లీ పాస్ పుస్తకాలు పొంది ఇతరులకు అమ్ముతున్నారని ఆరోపించారు. విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రోగ్రెసివ్ ట్రస్ట్ ప్రతిభ పరీక్షకు హాజరైన విద్యార్థులు

కామారెడ్డి అర్బన్: పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ హైదరాబాద్ ప్రగతి నగర్ విద్యానికేతన్‌లో అనాథలకు ఉచిత ప్రవేశాలకు సోమవారం కామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభ ప్రవేశ పరీక్షకు 19 మంది విద్యార్థులు హాజరయ్యారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు, రాష్ట్ర బాధ్యుడు రాజవర్ధన్, జిల్లా ప్రతినిధులు నారాయణ, నాంపల్లి, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

యోగా భవన్‌కు స్మార్ట్ టీవీ బహూకరణ

కామారెడ్డి అర్బన్: జిల్లా యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనానికి యోగా విద్యార్థులు స్మార్ట్ టీవీని బహూకరించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ నిర్వహిస్తుండగా 22వ బ్యాచ్ అసిస్టెంట్ యోగా టీచర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థి ఎస్.వెంకటేష్ తన పుట్టిన రోజు సందర్భంగా అండ్రాయిడ్ స్మార్ట్ టీవీని బహూకరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డి, ప్రతినిధులు బి.రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.